RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 428 | 21 మంగళవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# గాంధీభవన్‌కు రావొద్దు..

## నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్‌పై నేడు నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు.ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు.



సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు.

బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరపున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్

# జనతా పార్టీ నాయకుల భేటీ



నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు.సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.



## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..

### కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు.


అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

## ఒకవైపు వర్షాలు, మరోవైపు సమావేశాలు..

# రెండూ దేశానికి మేలు చేయాలి

### : ప్రధాని మోదీ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. ఈ వర్షాకాలం, అలాగే పార్లమెంట్ సమావేశాలు రెండూ దేశానికి ఫలప్రదంగా ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ యువత సాధిస్తున్న అద్భుత విజయాలను కొనియాడుతూ, వారి సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలె అనంతమైనవని ప్రశంసించారు."వర్షాకాలం అయినా, వర్షాకాల సమావేశాలైనా రెండూ చాలా ఫలప్రదమైనవి. ఈ రెండూ ఫలవంతంగా సాగినప్పుడు దేశ సంక్షేమానికి, సర్వ జీవుల సంక్షేమానికి మేలు జరుగుతుంది. అందుకే ఈసారి కూడా రెండూ సఫలం కావాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని అన్నారు. గత నెలలో దేశం జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాలలో అనేక మైలురాళ్లను అధిగమించిందని, ఈ విజయాల పరంపర దేశ పౌరులలో గర్వాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు.అంతరిక్ష రంగంలో యువత సాధిస్తున్న విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతేడాది వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకున్నారని గుర్తుచేశారు. ఈసారి హైదరాబాద్‌కు చెందిన 'స్కైరూట్ ఏరోస్పేస్' అనే సంస్థ 'మిషన్ ఆగమన్' కింద దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను విజయవంతంగా ప్రయోగించిందని తెలిపారు. "స్కైరూట్‌లో పనిచేస్తున్న యువత సగటు వయసు కేవలం 28 సంవత్సరాలు. నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు, 28 ఏళ్ల సగటు వయసున్న యువత గురించి మాట్లాడుతున్నాను. వీరు అంతర్జాతీయ స్థాయిలో భారత పతాకాన్ని సగర్వంగా ఎగరవేశారు" అని మోదీ అన్నారు.భారతదేశ ప్రతిష్ఠ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, ఆమోదం పొందుతోందని ప్రధాని వివరించారు. "ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు. ఇదొక శక్తిమంతమైన సందేశం. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలె అపరిమితమైనవి అనడానికి ఇంతకంటే స్ఫూర్తిదాయకమైన సందేశం మరొకటి ఉండదు" అని ఆయన వ్యాఖ్యానించారు.ఇదే సమయంలో దేశంలో సాధించిన ఇతర విజయాలను కూడా ప్రధాని గుర్తుచేశారు. రాజస్థాన్‌లో భారీ ఆయిల్ రిఫైనరీని జాతికి అంకితం చేయడం, దేశంలో




మూడో సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభించడం, ప్రపంచంలో అతికొద్ది దేశాల వద్ద మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత రైలును అందుబాటులోకి తీసుకురావడం వంటివి జరిగాయని తెలిపారు. "ఈ విజయాలన్నీ భారతదేశ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, కార్మికుల అంకితభావానికి నిదర్శనం. వీరంతా దేశం కోసం కలిసికట్టుగా పనిచేస్తున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

### ఆ బాలిక జీవితాంతం

## వీల్ చైర్ మీద ఎలా బతుకుతుంది?

### : హరీశ్ రావు



ఖమ్మంలో బాలిక మీద అఘాయిత్యం జరిగితే ఆరోజు కూడా బీఆర్ఎస్ పార్టీ స్పందించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాలేదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సోమవారం బాన్సువాడ మాతా శిశు దవాఖానలో చికిత్స వికటించి, నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం ఘటనలో మేము రాగానే సీతక్క, తుమ్మల వచ్చి హడావిడి చేశారు.బాధిత బాలిక కూడా ఇంకా దవాఖానలో ఉండటంతో తనని కూడా పరామర్శించామన్నారు. ఆ అమ్మాయి పరిస్థితి బాగా లేదు.. తాను ఇంక నిలబడటం కష్టమే అని డాక్టర్లు చెబుతున్నారు. 8వ తరగతి చదువుతున్న బాలిక జీవితాంతం వీల్ చైర్ మీద ఎలా బతకాలి? ఆ అమ్మాయికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, వారి కుటుంబాన్ని ప్రభు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## సాగునీటి శాఖ భూముల్లో సోలార్ ప్రాజెక్టులు.. ఉత్తమ్

సాగునీటి సంస్థలకు చెందిన ఖాళీ భూముల్లో భారీ ఎత్తున సౌర విద్యుత్తు (సోలార్) ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.సాగునీటి సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చి, వాటిని స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు కార్యాచరణపై ఆదివారం హైదరాబాద్‌లోని కుందన్‌బాగ్‌లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
21 మంగళవారం జూలై 2026

# ఇందిర మహిళా శక్తి పథకం కింద మహిళలకు చీరల పంపిణీ

## మొగిలిచర్లలో ఘనంగా కార్యక్రమం

## మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న కందుల అశోక్

వరంగల్, జూలై 20 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లలో సోమవారం ఇందిర మహిళా శక్తి పథకం కింద మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం 15వ డివిజన్ అధ్యక్షుడు కందుల అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కందుల అశోక్ మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, సామాజిక భద్రత, ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు గౌరవం, భరోసా కల్పించడంతో పాటు వారి సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతిని దృష్టిలో



పెట్టుకుని పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పరకాల ఇందిర మహిళా డెయిరీ ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించారని కొనియాడారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, మహిళా సాధికారతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొగిలిచర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బెజ్జాల కుమారస్వామి, సీనియర్ నాయకులు కుసురి యాదగిరి, బొట్టు శ్రీను, మంద కోదండపాణి, రాజబోయిన రాజేందర్, మంద రాజు, కుసురి రాజు, ఆర్‌పీలు మెరుగు శ్రీలత, తిప్పని ప్రేమలత, దూడే అరుణ, పుచ్చ సుజాత, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఓటరు సేవల్లో కోట అరుణకు అభినందనలు

## గొర్రెకుంట 137వ బూత్‌లో వేగవంతంగా గణన పత్రాల సేకరణ, డిజిటలైజేషన్ పూర్తి



గీసుకొండ, జులై 20 హైదరాబాద్ ఎస్టేట్:
ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, వేగవంతంగా గణన పత్రాల సేకరణ, డిజిటలైజేషన్ పూర్తి చేసిన గొర్రెకుంట గ్రామం 137వ బూత్ బీఎల్ఓ కోట అరుణను మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలెపాక సుమన్ అభినందించారు. 137వ బూత్ పరిధిలో 1311 మంది ఓటర్లు ఉండగా, బీఎల్ఓ కోట అరుణ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించడం, గణన పత్రాలను పంపిణీ చేయడం, తిరిగి వాటిని స్వీకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని సుమన్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఓలు బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో సేవలందించిన కోట అరుణ పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. బీఎల్ఓ కోట అరుణ సేవలను గుర్తించి త్వరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలెపాక సుమన్ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని ఆయన కోరారు. బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కాకతీయ క్షేత్రంలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

## వారాహి దేవి నవరాత్రుల సందర్భంగా శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో అనఘాష్టమి వ్రతంలో పాల్గొని రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రార్థనలు

పరకాల, జూలై 20 హైదరాబాద్ ఎస్టేట్:
కాకతీయుల కాలం నాటి చారిత్రక శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో వారాహి దేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీ అనఘాష్టమి వ్రత మహోత్సవంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కుంకుమేశ్వర స్వామి, అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించి ఆలయ వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వారాహి దేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీ అనఘాష్టమి వ్రత మహోత్సవంలో మహిళలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వేదఘోషలు, మంగళవాయిద్యాలు, భక్తుల రాకపోకలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో శాంతి, సామరస్యం నెలకొని అభివృద్ధి మరింత వేగవంతం కావాలని స్వామివారిని



ప్రార్థించారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఈ దేవాలయంలో నిర్వహించిన వారాహి దేవి నవరాత్రుల వేడుకలు భక్తిపారవశ్య వాతావరణంలో కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి పట్టణంలో ఇంటింటి మొక్కల పంపిణీ



హైదరాబాద్ ఎస్టేట్ దేవరకొండ ప్రతినిధి:-
సర్పంచి పసునూరు యుగంధర్ రెడ్డి కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రతి ఇంటికి 2 మొక్కల చొప్పున పంపిణీ చేశారు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు కాలనీ వాసుల ఇళ్లకు వెళ్లి మొక్కలు అందజేసి వాటిని సంరక్షించాలని సూచించారు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంట్లో హరితాన్ని పెంచి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచి యుగంధర్ రెడ్డి పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్ మరియు ఉప సర్పంచ్ భర్త వెంకటయ్య వార్డు సభ్యులు గంట మల్లేష్ బిజిలి లింగయ్య కొండల్ వస్కుల బక్కలయ్య వస్కుల శ్రీను గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జిల్లా బాధ్యతలతో గొర్రెకుంటకు గౌరవం

## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల సంపత్‌కు మంచి కాపరి కతోలిక సంఘం, ప్రతిభ యువజన సంఘం ఘన సన్మానం

గీసుగొండ, జూలై 20 హైదరాబాద్ ఎస్టేట్:
ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గొర్రెకుంట గ్రామానికి చెందిన ల్యాదల్ల సంపత్ కు మంచి కాపరి కతోలిక సంఘం, ప్రతిభ యువజన సంఘం సభ్యులు ఘన సన్మానం నిర్వహించారు. ఈ నెల 19న ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ల్యాదల్ల సంపత్ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం గొర్రెకుంట గ్రామానికి గర్వకారణమని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన ల్యాదల్ల సంపత్ మాట్లాడుతూ, తనపై ప్రేమాభిమానాలు చూపించి



ఘనంగా సన్మానించిన మంచి కాపరి కతోలిక సంఘం, ప్రతిభ యువజన సంఘం సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి ప్రేమాభిమానాలకు తగిన విధంగా మరింత అంకితభావంతో ప్రజాసేవలో కొనసాగుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంచి కాపరి కతోలిక సంఘం అధ్యక్షుడు మిద్దెపాక సతీష్, కోశాధికారి కుక్కముడి అరుణ్, కార్యదర్శి కొమ్ముల మల్లయ్య, ల్యాదల్ల అనిల్, ల్యాదల్ల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు జెల్ల రాజుకుమార్, 15వ డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సిరిమిల్ల శరత్ చంద్ర, ప్రతిభ యువజన సంఘం సభ్యులు ల్యాదల్ల కళాధర్, ప్రశాంత్, ప్రణయ్, అంభి, రవితేజ, పిలిప్, అక్షయ్, విన్ను, జెన్నీ, హ్యాపీ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన రైతులకు శుభవార్త..

## పలు పథకాలపై సబ్సిడీలు అందుబాటులో

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 20:-
ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యాన పథకాల ద్వారా లభించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ ఉద్యాన శాఖ అధికారి నవీన కోరారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)



కింద డ్రాగన్ ఫ్రూట్, అంజీర, అవకాడో, మామిడి, బొప్పాయి వంటి పండ్ల తోటలు, పూల సాగు, ప్లాస్టిక్ మల్చింగ్, మినీ ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, ట్రెల్లిస్ విధానంలో కూరగాయల సాగుకు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే 20ఐ20ఐ3 మీటర్ల పరిమాణంలో నిర్మించే నీటి కుంటలకు రూ.90 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కూరగాయల పందిరి, టీజీఎంఐపీ పథకం ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్లకు కూడా సబ్సిడీ అందుబాటులో ఉందన్నారు. ఆసక్తి గల రైతులు ఇబ్రహీంపట్నం డివిజన్ ఉద్యాన శాఖ అధికారి నవీన (89777 14219), అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల్ మండలాల హెచ్‌ఈవో నగేష్ (90000 67324), యాచారం, మాడుగుల మండలాల హెచ్‌ఈఓ లిసీతారాం (87902 54331)లిలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# అడుప మహేష్‌కు కాంగ్రెస్ నేతల కన్నీటి నివాళి

## పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో గాయపడి చికిత్సకు తరలిస్తుండగా మృతి..

## కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

వరంగల్, జూలై 20 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందిన గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ అడుప మహేష్ మృతి పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. సోమవారం అడుప మహేష్ స్వగృహంలో ఉంచిన పార్థివదేహానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కే.ఆర్. నాగరాజు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని అడుప మహేష్ పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అడుప మహేష్ చేసిన సేవలు గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మహేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు



తెలిపారు. అనంతరం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అడుప మహేష్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

# వాస్తవాలే గెలిచాయి.. తిరిగి మీటర్ బిగింపు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 20:-
ఇబ్రహీంపట్నం: ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని బొంగులూరు గ్రామం ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ మీటర్ తొలగింపుపై ఇటీవల ఓ పత్రికలో ప్రచురితమైన కథనంలో పేర్కొన్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని స్థానికులు తెలిపారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం తొలగించిన అదే చోట విద్యుత్ మీటర్‌ను తిరిగి అమర్చినట్లు వెల్లడించారు. వాస్తవాలను పూర్తిగా తెలుసుకోకుండా అత్యుత్సాహంతో అసత్య ఆరోపణలు చేస్తూ కథనం ప్రచురించడం సరికాదని బాధితులు పేర్కొన్నారు. ఒక విలేఖరిపై నిరాధార ఆరోపణలు చేయడం, ప్రత్యేకంగా పేరును ప్రస్తావిస్తూ వాస్తవం లేని వార్త ప్రచురించడం బాధాకరమని అన్నారు. ఇకపై ఏ అంశంపైనా పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని, నిర్ధారణ లేని సమాచారంతో కథనాలు రాసి జర్నలిస్టుల వృత్తి విశ్వసనీయతకు భంగం కలిగించవద్దని బాధితులు విజ్ఞప్తి చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## అధికారుల హామీతో పార్కు ఆక్రమణ వివాదానికి కదలిక





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 20:-
బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీనగర్--ఆఫీసర్స్ కాలనీ పార్కు స్థలం అక్రమ ఆక్రమణకు గురై భవన నిర్మాణం కొనసాగుతోందంటూ స్థానికులు చేసిన ఫిర్యాదులకు స్పందన లేకపోవడంతో సోమవారం బీజేపీ నాయకులు వినూత్నంగా నిరసన చేపట్టారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఎల్బీనగర్ అసెంబ్లీ బీజేపీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట "వంటా--వార్పు" నిర్వహించి అధికారుల దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కాలనీవాసులకు అవసరమైన పార్కు స్థలాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా ఫిర్యాదులు చేసినా చర్యలు లేకపోవడంతోనే నిరసనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. నిరసనకు స్పందించిన అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పార్కు స్థలాన్ని పూర్తిగా పరిరక్షిస్తామని, అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జేసీబీ సహాయంతో ఆక్రమిత ప్రాంతాన్ని శుభ్రం చేసే చర్యలు ప్రారంభించారు.అధికారుల హామీపై కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, పార్కు స్థల పరిరక్షణ కోసం కృషి చేసిన బీజేపీ నాయకులు సామ రంగారెడ్డి, మొద్దు లచ్చి రెడ్డి సహా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కాలనీ సంఘాల ప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన సాయిధయ ఎన్‌క్లేవ్ నూతన కమిటీ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 20:-
ఆదిబట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్ వార్డులో ఉన్న ఇంజాపూర్ సాయిధయ ఎన్‌క్లేవ్ కాలనీ నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రత, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలనే లక్ష్యంతో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా ఆర్. భరత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె. కృష్ణ నాయక్, జనరల్ సెక్రటరీగా జె. జానకిరాములు నాయక్, కోశాధికారిగా వల్లమల్ల స్వామి, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్. శ్యామ్ ప్రసాద్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్. శ్రవణ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు కాలనీవాసులు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ప్రతి నివాసితుడి సహకారంతో కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కాలనీవాసులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేసి, వారి సేవలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## డి లిమిటేషన్, మహిళా బిల్లులకు లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా పూర్తి మద్దతు ఇస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు దశరథ నాయక్



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్
ఈసారి అయినా కేంద్రంలో అన్ని పార్టీలు డిలిమిటేషన్ మరియు మహిళా బిల్లులకు పూర్తిగ మద్దతు ఇవ్వాలి అని మా పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాం.ప్రతిపక్షాలు దేశంలో ఉన్న అన్ని పార్టీల వీళ్ళు ఈ రెండు బిల్లులకు మద్దతు ఇవ్వాలి. ఒకవేళ వ్యతిరేకించేవాళ్ళు ఉంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారో టీవీ ద్వారా ప్రజలకు తెలియజేయాలి, మీడియా మిత్రులకు తెలియజేయాలి. సరైన కారణం లేకుండా వ్యతిరేకిస్తే ఈసారి మహిళా సమాజం క్షమించదు అని ఈ సందర్భంగా మేము తెలియ పరుస్తున్నాం. దేశ ప్రజల తరుపున, మహిళల తరుపున మా పార్టీ తరుపున మహిళా బిల్లు, డిలిమిటేషన్ బిల్లులకు మద్దతు ఇవ్వాలని అన్ని పార్టీలను డిమాండ్ చేస్తున్నాం!

## వైభవంగా శ్రీ జగన్నాథ్ రథయాత్ర

### పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి



హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 20 :
మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని అష్టలక్ష్మి దేవాలయం నుంచి శ్రీ జగన్నాథ్ రథయాత్ర ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమైంది. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,శ్రీ జగన్నాథ స్వామి వారి ఆశీస్సులు మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.సమాజంలో భక్తి,సోదరభావం,సామరస్యం పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి,ప్రణవానంద ప్రభుజీ,నర్సింగ్ ప్రభుజీ,శ్రీనివాస్ ప్రభుజీ,అష్టలక్ష్మి దేవాలయం చైర్మన్ శ్రవణ్,సెక్రటరీ సుధాకర్ గుప్తా,ఐలిత అంజయ్య,శ్రీధర్ కుమార్,రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్,రమేష్,పెద్దవల సైదులు,విష్ణు రెడ్డి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్కర్సు రాజయ్యకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నివాళి

### పరామర్శించిన ఎమ్మెల్యే.. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా



గీసుగొండ, జులై 20 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుగొండ మండలం మచ్చాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కర్సు రవికుమార్ తండ్రి లక్కర్సు రాజయ్య ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సోమవారం ఉదయం మచ్చాపూర్‌లోని వారి నివాసానికి చేరుకుని రాజయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, రాజయ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీతో పాటు తాను కూడా కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వంకుడోతు గోపాల్, మాజీ ఎంపీపీ సౌజన్య, జిల్లా నాయకుడు చాడ కొమురర రెడ్డి, ఏనుమాముల డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, మండల సమన్వయ కమిటీ సభ్యులు పత్తిపాక రవీందర్, దూల వెంకన్న, కూసం రమేష్, ఊకల్ సర్పంచ్ కక్కెర్ల సుభాష్, అనంతారం సర్పంచ్ తాటికాయల సతీష్, శాయంపేట సర్పంచ్ గాలి యాకయ్య, కొనయిమాకుల సర్పంచ్ వజ్రరాజు, కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమున ప్రవీణ్, ఉప సర్పంచులు పీసాల రాజేశ్వరరావు, జన్ను సుధాకర్, మండల నాయకులు కొమ్ము శ్రీకాంత్, ఎండీ జావీద్, ఊకల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, గీసుగొండ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దౌడు ప్రవీణ్, మనుకొండ గ్రామ నాయకుడు కందికొండ రాజు, శాయంపేట సర్పంచ్ జూల రమేష్, బాధవత్ రమేష్, హలవత్ వీరన్న, మండల నరేష్, మంద రమేష్, మర్రి రాజలింగం, వీరభద్రం తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని లక్కర్సు రాజయ్యకు నివాళులర్పించారు.

## మాతృవియోగంలో బిక్షపతి దంపతులకు ఆత్మీయ పరామర్శ

### మడే కుటుంబానికి అండగా నిలిచిన ప్రముఖులు..
### మాతృమూర్తి సేవలను గుర్తు చేసుకున్న నేతలు



మంగపేట, జులై 20 హైదరాబాద్ ఎస్టేట్:
ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పలువురు ప్రముఖులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ములుగు జిల్లా మంగపేట మండలం నర్సాయిగూడెం గ్రామానికి చెందిన మడే బిక్షపతి తల్లి మృతి నేపథ్యంలో హనుమకొండ పట్టణంలోని నేతాజీ వాకర్స్ అసోసియేషన్, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు బిక్షపతి, ఆయన సతీమణి పూర్ణిమ దంపతులను, సోదరుడు నీలం బాబు, కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మాతృవియోగ బాధలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెబుతూ మనోస్థైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తన పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది, సమాజానికి సేవ చేసే స్థాయికి తీసుకువచ్చిన మడే బిక్షపతి తల్లి ఆదర్శ మాతృమూర్తి అని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా, సంఘ నాయకుడిగా బిక్షపతి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. బిక్షపతితో తమకున్న అనుబంధం ఎంతో ఆత్మీయమైనదని, ఆయన కుటుంబానికి కలిగిన మాతృవియోగం తీరని లోటని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, మర్రి ఇంద్రసేనారెడ్డి, బొబ్బిలి లింగారెడ్డి, శేఖర్ గౌడ్, విజేందర్ రెడ్డి, కుమారస్వామి, కృష్ణయ్య, శ్రీరాములు, తాళ్లపెల్లి సతీష్ రాజు, సుకుదేవ్, హరి, రవి, దిలీప్, గట్టి ఎల్లయ్య, ఎట్టి వెంకన్న, ప్రతాప్, శ్రీధర్, తోట సత్యం, ఆలయం నరసయ్య, పలువురు ఉపాధ్యాయులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మలక్‌పేట్‌లో 'పిక్సెల్ ఎల్ఈడీ' నూతన కార్యాలయం ఘనంగా ప్రారంభం

### – ముఖ్య అతిథిగా విచ్చేసిన మలక్‌పేట్ సీఐ కె. నరసింహ
### – ఆకట్టుకుంటున్న అత్యాధునిక ఎల్ఈడీ సాంకేతిక ఉత్పత్తులు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి, ఎల్బీనగర్ జులై 20:
మలక్‌పేట్ అస్మాన్‌గఢ్‌లో ప్రముఖ ఎల్ఈడీ డిస్‌ప్లేల తయారీ సంస్థ 'పిక్సెల్ ఎల్ఈడీ ప్రైవేట్ లిమిటెడ్' నూతన ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మలక్‌పేట్ సీఐ కె. నరసింహ ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో పిక్సెల్ ఎల్ఈడీ సంస్థ డైరెక్టర్లు సందీప్ కేర్ సింగ్ (సేల్స్ & టెక్నాలజీ), ఎం.ఏ. అలీమ్ (సౌత్ ఇండియా సేల్స్ & సర్వీస్), మరియు మృత్యుంజయ్ కుమార్ సింగ్ (సేల్స్ & సర్వీసెస్) లతో పాటు పలువురు స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తమ సరికొత్త ఇన్-డోర్ మరియు అవుట్-డోర్ ఎల్ఈడీ స్క్రీన్ల సాంకేతికతను అతిథులకు వివరించారు. ఈ సందర్భంగా మలక్‌పేట్ సీఐ కె. నరసింహ మాట్లాడుతూ.. "సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యాపారాలు విస్తరించడం అభినందనీయం. మలక్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అత్యాధునిక డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్ల సంస్థ అందుబాటులోకి రావడం సంతోషకరం. నాణ్యమైన సేవలతో, సరికొత్త సాంకేతికతతో ఈ సంస్థ వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలని, వ్యాపారపరంగా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను." అన్నారు. సంస్థ డైరెక్టర్లు మాట్లాడుతూ.. "ఢిల్లీ, ముంబై నగరాల తర్వాత దక్షిణ భారతదేశంలో మా వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడానికి హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో ఈ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించాము. ఇండోర్, అవుట్‌డోర్ ప్రకటనలు, ఈవెంట్లకు సంబంధించిన అత్యాధునిక ఎల్ఈడీ డిస్‌ప్లేలను అత్యుత్తమ నాణ్యతతో, మెరుగైన సర్వీస్ సపోర్ట్‌తో వినియోగదారులకు అందిస్తాం. మా నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసి మమ్మల్ని ఆశీర్వదించిన సీఐ కె. నరసింహకి, ఇతర పెద్దలకు మా ధన్యవాదాలు." అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయి కీర్తన్ రెడ్డి జన్మదినం సందర్భంగా 5 వేల మందికి అన్నదానం

### బీఆర్ఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు.. ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానంతో ప్రజలకు అండ






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 20:-
ఇబ్రహీంపట్నం: బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి తనయుడు బూడిద సాయి కీర్తన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వరుసగా మూడు రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఉప్పరిగూడ గ్రామం, ఇబ్రహీంపట్నం మండల కేంద్రం, యాచారం మండల కేంద్రం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సేవా కార్యక్రమాల ముగింపు సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నం ఓం చౌరస్తాలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు ఐదు వేల మందికి భోజనాన్ని అందించి మానవతా సేవను చాటుకున్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద నందా రెడ్డి, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి, కౌన్సిలర్లు గూడూరు రవి, కొండ్రు ప్రవీణ్, సర్పంచులు శ్రీ వేణినంద కుమార్, జోగు శంకరయ్య, శ్రీను, జయచందర్ నాయక్, తుర్కయంజాల్ మాజీ కౌన్సిలర్ గుండ్ల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ చిలుకల యాదగిరితో పాటు ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సమాజ సేవే ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# వెయ్యి పండ్ల మొక్కలతో పర్యావరణానికి చేయూత

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 20:-
రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావేరిక్స్ ఆధ్వర్యంలో సోమవారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్-3లోని భూపోరాట కేంద్రంలో సుమారు వెయ్యి పండ్ల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల పండ్ల చెట్లను నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు అజయ్ కుమార్ మాట్లాడుతూ, నేడు నాటిన చిన్న మొక్క రేపటి తరాలకు నీడ, స్వచ్ఛమైన గాలి, పోషకాహారం, ఆరోగ్యాన్ని అందించే మహావృక్షంగా ఎదుగుతుందని అన్నారు. మొక్కలు నాటడం కేవలం పర్యావరణ కార్యక్రమం మాత్రమే కాకుండా భవిష్యత్ తరాల పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఓ వృద్ధుడు, "ఈ చెట్టు ఇచ్చే పండ్లు నేను తినకపోయినా నా మనవలు, మనవరాళ్లు వాటి నీడలో ఆడుకుంటూ పండ్లు తింటారు. అదే నాకు ఆనందం" అని చెప్పడం అందరినీ భావోద్వేగానికి గురి చేసింది. చిన్నారులు మొక్కలకు నీరు పోయగా, తల్లిదండ్రులు మట్టి నింపుతూ, రోటరీ సభ్యులు కలిసి





మొక్కలు నాటడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
పండ్ల చెట్లు కుటుంబాలకు పోషకాహారాన్ని అందించడంతో పాటు స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల చేసి కాలుష్యాన్ని తగ్గిస్తాయని, పక్షులు, తేనెటీగలు, సీతాకోకచిలుకలకు ఆశ్రయంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భూగర్భ జలాల పెంపు, పర్యావరణ సమతుల్యత, కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో కూడా పండ్ల చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పగడాల భార్గవి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మాజీ అధ్యక్షులు సురేష్ బాబు, ఉపాధ్యక్షురాలు మాధవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సీత ఆనంద్, మెంబర్‌షిప్ డైరెక్టర్ శేఖర్ గోగినేని, విజయలక్ష్మి, వరలక్ష్మి, వాసిరెడ్డి నాగేశ్వరరావు, సతీష్, ప్రసన్న, మధుసూదన్‌రావు, రత్నాకర్, సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల నాయకులు అజ్మీరా హరిసింగ్ నాయక్, కేతారాజు నర్సింహా, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ను కాంగ్రెస్ అధ్యక్షుడు మెటై శ్రీశైలం గ్రామ అధ్యక్షుడు నీలం రాములు అందజేశారు



హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి జూలై 20
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మొహమ్మద్ రజాక్ మంజూరు అయిన రూ.28,000/- (ఇరవై ఎనిమిది వేల రూపాయలు) సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం, గ్రామ అధ్యక్షులు నీలం రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారునికి అందజేశారు.
ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, యాచారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జయప్రకాష్, మదర్ డైరీ డైరెక్టర్ మండలి జంగయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైకని వినోద్, వార్డు సభ్యులు దార దశరథ్, యూసఫ్ పటాన్, మాజీ సర్పంచ్ దూస రమేష్, సీనియర్ నాయకులు నీలం పాండు, బన్నే జంగయ్య,ఆడాల శ్రీకాంత్,మండల్ యాదగిరి మూతకాని శ్రీకాంత్ కొప్పు శివ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవనోపాధి కోల్పోయిన గౌడ్ అన్నలు న్యాయం చేయాలని ధర్నా

## గౌడ సంఘం అధ్యక్షుడు నీళ్ల సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 20:-
రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ గ్రామంలో గీత కార్మికుల జీవనాధారానికి సంబంధించిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామంలో విల్లాల నిర్మాణం కోసం ఏఆర్‌కే డెవలప్‌మెంట్ సంస్థ 120కు పైగా తాటి చెట్లను తొలగించిందని గీత కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా తాటి చెట్లను నేలకూల్చడం వల్ల తరతరాలుగా వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా గీత కార్మికులు ధర్నా నిర్వహించగా, సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో బీజేపీ పార్టీ నాయకుడు కొత్త అశోక్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పల్లె గోపాల్ గౌడ్, మాజీ సర్పంచ్ కొత్త యాదగిరి గౌడ్, కౌన్సిలర్ నీళ్ల హరిదాస్ గౌడ్





పాల్గొని గీత కార్మికులకు మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తాటి చెట్లు గీత కార్మికులకు కేవలం చెట్లు మాత్రమే కాదని, అవే వారి జీవనాధారం, కుటుంబాల ఆర్థిక బలమని పేర్కొన్నారు. చెట్ల తొలగింపుతో అనేక కుటుంబాలు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం అందించడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గీత కార్మికుల హక్కులను పరిరక్షించే చర్యలు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గౌడ సంఘం కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొని గీత కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.

# సుల్తాన్‌బజార్ పోలీసుల చాకచక్యంతో తప్పిపోయిన బ్యాగ్ స్వాధీనం

హైదరాబాద్, జూలై 19: సుల్తాన్‌బజార్ పోలీసుల సత్వర స్పందన, అంకితభావంతో చేసిన దర్యాప్తు ఫలితంగా ఓ విద్యార్థికి చెందిన తప్పిపోయిన బ్యాగ్‌ను గుర్తించి బాధిత కుటుంబానికి అప్పగించారు.జూలై 10వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో డా. హీరాలాల్ దాస్ భార్య, కుమారుడు రిత్విక్ నారాయణగూడలోని స్మార్ట్ బజార్‌కు షాపింగ్ కోసం వెళ్లారు. తమ స్కూటీని బి-2



పార్కింగ్‌లో నిలిపి, అందులోనే పొరపాటున ఒక బ్యాగ్‌ను వదిలి వెళ్లారు. ఆ బ్యాగ్‌లో ఐసీఎస్ఈ పాఠశాల పుస్తకాలు, పెన్ డ్రైవ్, నగదు, ఇతర స్టేషనరీ సామగ్రి ఉన్నాయి.
షాపింగ్ ముగించుకుని సాయంత్రం సుమారు 7.20 గంటలకు తిరిగి వచ్చేసరికి బ్యాగ్ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో, సీసీటీవీ ఫుటేజీ పరిశీలించేందుకు ప్రయత్నించినప్పటికీ వెంటనే సహకారం అందలేదు. దీంతో వారు డయల్-100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరారు.సమాచారం అందుకున్న వెంటనే నలుగురు హైదరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. అందులో ఓ గుర్తుతెలియని వ్యక్తి స్కూటీపై ఉన్న బ్యాగ్‌ను తీసుకుని వెళ్లినట్లు గుర్తించారు.
తదనంతరం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయగా, కానిస్టేబుళ్లు బి. రవీందర్, జయపాల్ కేసు దర్యాప్తును చేపట్టారు. కానిస్టేబుల్ బి. రవీందర్ పలు ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అనుమానితుడి కదలికలను నారాయణగూడ వరకు గుర్తించారు. అర్ధరాత్రి వరకు దర్యాప్తును కొనసాగించారు.మరుసటి రోజు కూడా పట్టుదలతో విచారణ కొనసాగించిన కానిస్టేబుల్ బి. రవీందర్, చివరకు చిక్కడపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో పడేసిన బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.అనంతరం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి. నరేష్ సమక్షంలో కానిస్టేబుల్ బి. రవీందర్ ఆ బ్యాగ్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా డా. హీరాలాల్ దాస్ మాట్లాడుతూ, సుల్తాన్‌బజార్ పోలీసుల వేగవంతమైన స్పందన, అంకితభావం, విధి నిర్వహణ పట్ల నిబద్ధత ప్రశంసనీయమని అన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని ప్రజలకు అండగా నిలుస్తున్న హైదరాబాద్ పోలీసులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐపీ అబాకస్ అకాడమీ

## -- శివం రోడ్, న్యూ నల్లకుంట విద్యార్థుల ఘన విజయం

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 20:
హైదరాబాద్ జోన్ పరిధిలోని ఎస్ఐపీ అబాకస్ అకాడమీ -- శివం రోడ్,న్యూ నల్లకుంట బ్రాంచ్ విద్యార్థులు జూలై 12న శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ త్రీలో నిర్వహించిన రీజినల్ ప్రాడిజీ--2026 పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు అవార్డులను కైవసం చేసుకున్నారు.3,200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో మా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం,తృతీయ స్థానం, పర్ఫార్మెన్స్ అవార్డులు మరియు బిగినర్ లెవల్ అవార్డులు సాధించి కేంద్రానికి విశేష గుర్తింపు తీసుకువచ్చారు.
సెంటర్ హెడ్ ఆతెం శ్రావణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ ఘన విజయాన్ని సాధించారు.ఈ విజయానికి అకాడమీ సిబ్బంది సహస్ర,సరస్వతి,వినీత,బుజ్జి అందించిన శిక్షణ, ప్రోత్సాహం,సహకారం ఎంతో దోహదపడ్డాయి.విజేతలుప్రథమ స్థానం:వి.బృందా,ఎస్.భావీర్ మహాత్రే,ఎం.అద్వైత్,ద్వితీయ స్థానం:పి.శ్రేయాంశ్,తృతీయ స్థానం:ఎ.మయాంక్,డి.త్రిపుర,ఎస్.దీక్షిత,
కరణ్ స్వైన్,బి.శ్రీనిత,కె.స్వాధింత,పర్ఫార్మెన్స్ అవార్డులు:
టి.అమృత,టి.హిమానీ,ఎ.శివాంక్,ఆర్ణా ఎస్.మహాత్రే,జి.స్వరంగి,మహ్మద్ వెకార్,అలీనా,సయ్యద్ నుసైర్ అహ్మద్.బిగినర్ లెవల్ అవార్డులు:కె.శ్రీవల్లి,అబ్దుల్లా ఖాన్,జి.ధినుజయ వర్ధన్,ఎన్.ఆక్షిత్,పి.తేజశ్రీ
ఈ సందర్భంగా సెంటర్ హెడ్ ఆతెం శ్రావణి విజేతలను అభినందిస్తూ,భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అబాకస్ శిక్షణ వల్ల పిల్లల్లో గణితంపై భయం తొలగి,వేగంగా లెక్కలు చేసే సామర్థ్యం పెరగడంతో పాటు



జ్ఞాపకశక్తి,ఏకాగ్రత,పరిశీలనా శక్తి,తార్కిక ఆలోచన,ఆత్మవిశ్వాసం,నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు.అలాగే చదువులో మెరుగైన ఫలితాలు సాధించడానికి,పోటీ పరీక్షలకు బలమైన పునాది ఏర్పడటానికి అబాకస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పిల్లల్లో క్రమశిక్షణ,సమయపాలన,సానుకూల ఆలోచనా విధానం పెంపొందించడంతో పాటు మొబైల్,టీవీలపై గడిపే సమయాన్ని తగ్గించి చదువుపై ఆసక్తి పెంచడంలో కూడా అబాకస్ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని ఆమె వివరించారు.తల్లిదండ్రుల అద్భుత సహకారం,విద్యార్థుల అంకితభావం,అకాడమీ బృందం నిరంతర కృషి ఫలితంగా రీజినల్ ప్రాడిజీ--2026 పోటీల్లో మా కేంద్రం నుంచి పాల్గొన్న 25 మంది విద్యార్థుల్లో 23 మంది అవార్డులు సాధించడం (92% విజయం) ఎంతో గర్వకారణమని సెంటర్ హెడ్ తెలిపారు.ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు,విద్యార్థులు,అకాడమీ సిబ్బంది అందరికీ సెంటర్ హెడ్ ఆతెం శ్రావణి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా ఆర్. లక్ష్మణ్ యాదవ్ జన్మదిన వేడుకలు



హైదరాబాద్, జూలై 19: టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఆర్. లక్ష్మణ్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం అంబర్ పేట్ లో అత్యంత ఘనంగా నిర్వహించారు . ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు పాల్గొన్నారు . ఈ సందర్భంగా లక్ష్మణ్ యాదవ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి భారీ కేక్ కట్ చేయించి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ:. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆర్. లక్ష్మణ్ యాదవ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన ముందుంటున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో లక్ష్మణ్ యాదవ్ మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఆర్. లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ:
తన పుట్టినరోజు సందర్భంగా విచ్చేసి ఆశీస్సులు అందించిన పెద్దలు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నేత గుజ్జ కృష్ణ, దిలీప్ కుమార్ నేత తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరంలో టిడిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం....

ఉమ్మడి విశాఖ జిల్లా డి సి ఎం ఎస్ చైర్మన్ & రంపచోడవరం పరిశీలకులు కోట్ని బాలాజీ సమక్షంలో, ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అధ్యక్షతన మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు పాల్గొని పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పని చేయాలిడ రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలని





వారికి పిలుపునిచ్చారూ. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# కృష్ణగారికి 20 సినిమాలు తెచ్చిపెట్టిన హిట్ మూవీ అదే!

సూపర్ స్టార్ కృష్ణ .. ఒకప్పుడు మాస్ ఇమేజ్ కి కేరాఫ్ అడ్రెస్. ఎన్టీఆర్ .. ఏఎన్నార్ ఒక రేంజ్ లో దూసుకుపోతున్న సమయంలో ఇండస్ట్రీకి వచ్చి, తన కెరియర్ ను పరిగెత్తించిన కథానాయకుడు ఆయన. ఒక వైపున విలేజ్ నేపథ్యంలో కథలతో మెప్పిస్తూ, మరో వైపున యాక్షన్ సినిమాలలో రాణించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. అలాంటి కృష్ణ కెరియర్ ను మలుపు తిప్పిన సినిమాలలో 'గూఢచారి 116' ఒకటి. ఈ సినిమాను గురించి దర్శకుడు మల్లికార్జున్ రావు తనయుడు నారాయణ బాబు 'సుమన్ టీవీ'తో మాట్లాడారు."మా నాన్న మల్లికార్జున్ రావు గారు సుందర్ లాల్ నహతా గారి సంస్థలో పనిచేసేవారు. నాన్నంటే ఆయనకి చాలా అభిమానం .. నమ్మకం. ఎందుకంటే వాళ్ల బ్యానర్ పై వచ్చే సినిమాలన్నిటికీ సంబంధించిన పనులను నాన్న దగ్గరుండి చూసుకునేవారు. సుందర్ లాల్ నహతాగారు నాన్నకి 'శాంతి నివాసం' సినిమా ఇచ్చారు. అయితే చివరి నిమిషంలో అది సీఎస్ రావుగారికి వెళ్లింది. దాంతో నాన్న చాలా అప్సెట్ అయ్యారు. అయినా వెంటనే తేరుకుని ముందుకు వెళ్లారు" అని చెప్పారు. 'గూఢచారి 116' సినిమాను కృష్ణగారితో చేయాలని నాన్న అనుకున్నారు. ఆయనతోనే చేస్తానని పట్టుబట్టారు. అయితే అప్పట్లో సుందర్ లాల్ నహతా గారికంటే కూడా 'డూండీ' గారిని ఒప్పించడం చాలా కష్టమైన విషయం. ఒక పట్టాన ఆయన ఒప్పుకునేవారు కాదు. అయినా ఆయనను ఒప్పించారు. అలా 'గూఢచారి 116' తెరకెక్కింది. ఈ సినిమా రిలీజైన మరుసటి రోజునే



కృష్ణగారు 20 సినిమాలలో బుక్ అయ్యారు. అప్పటికీ .. ఇప్పటికీ ఇది రికార్డే" అని అన్నారు.

# జాతీయ అవార్డుల విజేతలకు మెగాస్టార్ చిరంజీవి అభినందనలు



72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన, ప్రతి విజేతకు తన శుభాకాంక్షలు అందజేశారు. ముఖ్యంగా, ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్ర బృందాన్ని అభినందిస్తూ, ఆ సినిమా నిర్మాత, తన సోదరుడి కుమార్తె నిహారిక కొణిదెలను చూసి ఎంతో గర్వపడుతున్నానని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే 'పుష్ప 2' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగంలో అవార్డు గెలుచుకున్న సుకుమార్‌కు, 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి గాను ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైనందుకు దర్శకుడు నాగ్ అశ్విన్, వైజయంతీ మూవీస్ బృందానికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "నాలుగోసారి ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డుకు ఎంపికైన నా ఆప్తమిత్రుడు మమ్ముట్టికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇది అసాధారణ విజయం" అని చిరంజీవి కొనియాడారు. 'లక్కీ భాస్కర్' చిత్రానికి ఉత్తమ సంభాషణల రచయితగా నిలిచిన వెంకీ అట్లూరిని, '35' చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవడం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. అదే చిత్రంలో తన ప్రతిభకు గాను ఉత్తమ బాలనటుడిగా అవార్డు గెలుచుకున్న అరుణ్ దేవ్‌ను కూడా ఆయన అభినందించారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భారతీయ సినిమా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుని, తరతరాలకు స్ఫూర్తినివ్వాలని చిరంజీవి ఆకాంక్షించారు.

# మీ సినిమాలో నటించడానికి నేను రెడీ.. రాజమౌళికి పీవీ సింధు ఫన్నీ రిక్వెస్ట్

భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు మరోసారి అంతర్జాతీయ వేదికపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడం తెలిసిందే. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి చారిత్రక ఘనతను అందుకుంది. నిన్న జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో ఆమె జపాన్‌కు చెందిన అగ్రశ్రేణి క్రీడాకారిణి అకనే యమగూచిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో సింధు 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో జపాన్ ఓపెన్ గెలిచిన మొట్టమొదటి భారతీయ షట్లర్‌గా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించింది. అయితే, ఈ చారిత్రక విజయం తర్వాత ఆమె సోషల్ మీడియాలో చేసిన ఒక వ్యాఖ్య క్రీడా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సింధు అద్భుత విజయంపై స్పందించిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. "ఇది నిజమైన ఛాంపియన్ కంబ్యాక్. నీ అద్భుత విజయానికి శుభాకాంక్షలు సింధు. దేశం మొత్తం నిన్ను చూసి గర్విస్తోంది" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాజమౌళి ప్రశంసలకు సింధు అంతే






ఆసక్తికరంగా, చమత్కారంగా స్పందించింది. రాజమౌళికి ధన్యవాదాలు తెలిపిన సింధు, ఆయన దర్శకత్వంలో రాబోతున్న 'వారణాసి' చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఆమె రాజమౌళికి ఒక సరదా ఆఫర్ ఇచ్చింది. "భవిష్యత్తులో మీ కథల్లో ఎప్పుడైనా ఒక బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పాత్ర అవసరమైతే, ఓ 'కొత్త నటి'గా మారడానికి నేను సంతోషంగా సిద్ధంగా ఉన్నాను" అంటూ ట్వీట్ చేసింది. ఈ ఊహించని ఆఫర్‌తో సింధు అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం రాజమౌళి, సింధు మధ్య జరిగిన ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తే బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు ఖాయమని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. క్రీడా మైదానంలో ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా తన చమత్కారంతో అందరినీ ఆకట్టుకుంటున్న సింధుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# రామాయణం సినిమా కాదు..

## భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయాణం: రకుల్



ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో భాగం కావడం తనకు గర్వకారణమని హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ పేర్కొంది. ఇది కేవలం ఓ సినిమా కాదని, భారత చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప ప్రయాణమని చెప్పింది. ఈ చిత్రంతో ప్రేక్షకులు ఓ అద్భుతమైన ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారని తెలిపింది.

ఢిల్లీలో ఇటీవల జరిగిన 'రామాయణం' ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను రకుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఈ సందర్భంగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ.. ఇంత భారీ స్థాయి చిత్రంలో భాగం కావడం జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిగా అభివర్ణించింది. భారత్‌కు ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తున్న భావన మాటల్లో చెప్పలేనిదని తన పోస్టులో పేర్కొంది. నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. రావణాసురుడి సోదరిగా కథలో కీలక పాత్ర పోషించనున్న ఆమె లుక్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో తొలి భాగాన్ని 2026 దీపావళికి విడుదల చేయనున్నారు. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## నాకు ఎవరి అనుమతి అక్కర్లేదు...

# ఇక నా జీవితం నాదే

## : అనుపమ పరమేశ్వరన్



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన, భావోద్వేగ పోస్ట్ చేశారు. తనకు శాంతి దొరికిందని, ఇకపై ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని, భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. "నా గొంతుకను నేనే ఎంచుకుంటా" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె రాస్తూ, "కొన్నిసార్లు శాంతిని కనుగొనడానికి కొన్నింటిని వదిలేయాల్సి ఉంటుంది. ఈ రోజు నాకు ఆ శాంతి దొరికింది. ఈ రోజు నుంచి నా గొంతుకను, నా జీవితాన్ని నేనే ఎంచుకుంటాను. ఇకపై అనుమతులు లేవు, భయాలు లేవు. నన్ను నేను వెతుక్కుంటూ నా జీవితాన్ని ప్రేమిస్తున్నాను" అని పేర్కొన్నారు. చాలా కాలంగా చెప్పాలనుకున్న విషయాన్ని ఇప్పుడు చెబుతున్నానని, ఇంతకాలం దాన్ని చెప్పేందుకు తనను అనుమతించలేదని ఆమె అన్నారు. అభిమానులందరికీ "ఐ లవ్యూ" చెప్పారు. తనపై నమ్మకం ఉంచి, అండగా నిలిచిన అభిమానులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సందేశం, ప్రతి ప్రార్థన తనకు అవసరమైన సమయంలో చేరాయని పేర్కొన్నారు. తనను తిరిగి తన దగ్గరకు చేర్చినందుకు యూనివర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వేచ్ఛను, తనను తాను ఎంచుకోవడాన్ని సంపూర్ణంగా స్వీకరిస్తున్నట్లు అనుపమ తన పోస్ట్‌ను ముగించారు. ఇక అనుపమ కెరీర్ విషయానికొస్తే, ప్రస్తుతం ఆమె శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ డ్రామా 'భోగి'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె కందుల సులోచన రాణి అనే పాత్రలో కనిపించనున్నారు. సులోచన పల్లెటూరి యువతిగా, ప్రకృతితో మమేకమయ్యే బలమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. ఈ సినిమాలో శర్వానంద్ 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు గతంలోనే మేకర్స్ ప్రకటించారు.







